# పరీక్షలు

డాక్టర్, మీ చూపులో నామీద తృణీకారభావం కనబడుతోంది. సుఖరోగిని చూస్తే మీకు లోకువ. వాళ్లు మదమెక్కి, చపలుడై, కోరితెచ్చుకున్న వ్యాధిలాగు కనపబడుతుంది మీకు. యీ యేడు నా యూనివర్సిటీ పరీక్షల్లా, డాక్టరు పరీక్షకింద తేలింది.

మొదటిప్రశ్న :- నీకేం జబ్బు?

జవాబు :- మీకే తెలుసు.

రెండో ప్రశ్న :- నీకెట్లా వొచ్చింది?

జవాబు :- హొటలు భోజనం చాలక చిక్కిపోతున్నానని మీరేగదా నన్ను రాత్రుళ్లు పాలు త్రాగమన్నారు! ఆ సలహావల్లనే, అసలు కలిగింది, యీ అంటువాధ్యికి కారణం. కనక దీంటో మీకు కూడా వుంది బాధ్యత. 'బిల్' పంపేటప్పుడా సంగతి జ్ఞాపకముంచుకోండి. మా సందుమధ్య చిన్న పాక. ఆ పాక వెనక దిబ్బ. ఆ దిబ్బమీద అవులు కట్టేసివుంటాయి. ఆ దిబ్బమీది ఆ పాకలో అక్కచెల్లెళ్ళిద్దరున్నారు. వాళ్ళదగ్గిరే నేను పాలవాడిక పెట్టాను. అదుగో, ఏదో వుద్దేశంతో పెట్టాననుకుంటున్నారప్పుడే మీరు! ఏమీ లేదు. చుట్టుపక్కల యిళ్ళవాళ్ళందరూ వాళ్ళదగ్గిరే పాలు పోయించుకుంటారు.

ఒక వారంరోజులయింతరవాత నా గదికి వాళ్ళ రాకపోక లెక్కువైనాయి. ఒకామె ప్రొద్దున్నే పాలు తీసుకొచ్చేది. మళ్ళీ యింకా కావాలా అని రెండో ఆమె అడిగేది. తరవాత మొదటి ఆమె పాలచెంబుకోసం వొచ్చేది, రాత్రులూ యింతే.....పాల చెంబుకోసం మొదటిఆమె వొచ్చి తీసికెళ్లేటప్పటికి రాత్రి పదయ్యేది.

నాతో గదిలోవున్న సీతయ్య వేళాకోళాలు మొదలుపెట్టాడు, వాళ్ళనీ నన్నూ కలిపి. నాకు కొంచెం సంతోషంగానే వుంది. వాళ్లు పెద్దవాళ్లయినా, నన్ను యెవరో స్త్రీలు కోరి, నా చుట్టూ తిరుగుతున్నారంటే కొంచెం గర్వంగా వుండదూ? నాకేమిటి, మీకుండదూ ? నా గదికి వచ్చే స్నేహితులతో చెప్పివాళ్లతో కలసి హాస్యాలు చేశాడు తరవాత.

'పోనీ, పాపం, వాళ్ళంతగా పరితపిస్తోవుంటే నీ దేం పోయింది?......' అనీ,

'కోరిన స్త్రీనిగాని, స్త్రీలనుగాని నిరాకరించడం పాపమని ధర్మశాస్త్రాల్లో వుండ'దనీ,

'మేంకూడా పాలవాడిక అక్కడే పెడతా'మనీ యిట్లా నవ్వేవాళ్లు. పదిహేను రోజుల్లో సీతయ్య శలవలకి యింటికి వెళ్లాడు. నేను రెండో సంవత్సరం క్లాసులో వుండడంవల్ల,

వుండిపోయినాను. ఆ మర్నాడే పెద్దామె 'మీ రక్షకుడు వూరికి వెళ్ళాడా?' అంది. తరవాత చూడండి, పాలకి వొచ్చి వాళ్లు కదలరు. 'స్టవ్' తమాషా చూస్తో కొంతసేపూ, అవులకి గడ్డీ దాణా ధరలెకువైనసంగతీ పొరుగువాళ్ళతో తగాదాల సంగతీ మాట్లాడ్డంతో కొంచెంసేపూ, వొచ్చినప్పుడల్లా ఒక అరగంటన్నా వుండిపొయ్యేవారు. ఎవరన్నా చూసి యేమనుకుంటారో అని ఒకటే భయం నాకు. వాళ్లిద్దరూ వయసు ముదిరినవాళ్లే. ఒకామెకి నలభై, యింకోఆమెకు కొంచెము తక్కువ వయస్సుంటుంది. ఇంత తెలివితక్కువ వాడేమీ, కొంచెమైనా అర్థంకాదేమీ అని నవ్వుకుంటున్నారని తెలిసి, సిగ్గుపడి, రోషపడి 'నాకు అర్థమైంది కాని, మీవంటి వాళ్లు నాకు పనికిరారు. నేను పోకిరి నన్నుకున్నారా? మా కుటుంబమర్యాద, శిష్టాచారం మా వూరు వస్తే మీకే తెలుస్తుంది !' అని వాళ్ళకి తెలియచెయ్యాలని వుండేది. ఒక్కొక్క రోజు మరీ వొంటరిగా వుండి, కొంచెం మతిచలనం కలిగినప్పుడు, పోనీ యింతలో పోయిందేమనిపించేదిగాని, యెవరికన్నా తెలుస్తుందనే భయం నన్ను కట్టేసేది. ఒక్కొక్క -ప్పుడు వాళ్ళమీదా, వాళ్లుపడేప్రయాసమీద జాలికలిగేది. నాకిటికీ దగ్గిరనించి వెడుతో, తన బాధకీ తనఅక్క బాధకీ, గడ్డిధరలు హెచ్చడానికీ, వాళ్ళ గొడ్లుల బందెలదొడ్డిలో పడడానికీ- అంతకీ నేను కారణమైనట్లువిచారంతో చూసేదినావంక ఆచిన్నామె. వాళ్ళతో, ఆ కొత్త అనుభవం యెట్లావుంటుందోననే విచిత్రపు కోర్కెతో వూటలూరేది నా మనసు.

ఆ రాత్రి 'మిల్టన్'పూర్తి చెయ్యాలనే నిశ్చయంతో 'టీ' తాగి కూచున్నాను. పగలంతా తీవ్రమైన ఎండకాసి, ప్రాణులమీద జాలికలిగినట్లు గాలివీస్తోంది. దీపం వెలుతుర్ని మించిన వెన్నెల కిటికీలోంచి వెల్లువలై పడుతోంది. తలుపు కొట్టిన చప్పుడయింది. ఎవరో తెలుసు. కాని, 'యెవరూ ?' అన్నాను.

'పాలచెం బియ్యండి' అంది, చిన్నామె కంఠం, వొచ్చి మాటలుపెట్టి 'డిస్టర్బు' చేస్తుందని, నేను, కాంప్‌కాట్ మీదనించి లేచి, చెంబుతీసుకొని, యివ్వడానికి తలుపు తెరిచేసరికి, తోసుకొని, లోపలికొచ్చింది, ఆమె.

"యేం చేస్తున్నారు ?"

"చదువుకుంటున్నాను. యిదుగో చెంబు."

"అయ్యో ! అంత తొందరేమండి ! పాలు బాగా వున్నాయా యివాళ !"

"ఆ"

"యే మెండకాసిందండీ ? చచ్చిపోయినామనుకోండి మేము ! మీ కెట్లావుందో కాని!...... దీపం మండుతోందండి....."

"లేదులే"

"అయ్యో మండుతోందండీ !......చూడండి లోపలికి వెడుతోంది. నాకు గుండెలు కొట్టుకుంటున్నాయి. భయంవెంటే సంతోషమూ, ఆతృత ఎక్కువౌ తున్నాయి. దీపం బాగా తగ్గించింది. ఆరాత్రి నన్ను వదలతలుచుకోలేదు. వెన్నెలతో గది నిండింది.

ఒక సంవత్సరంనించి యింటికి వెళ్ళలేదు. బ్రహ్మచారి జీవితం గడుపుతున్నాను. నెలరోజులనించి పుష్టి, అనుభవమూ కల యిద్దరు స్త్రీలు నా చుట్టూ తిరుగుతున్నారు. నా వివేకమంతా నశించి, యెందుకిట్లాంటి అవస్థ తెచ్చుకున్నావంటే, యింకేం చెప్పను?

"అబ్బా ! యెంత వుక్కగావుంది ! యీ గది లోపల ఎట్లా పడుకుంటున్నారో గాని !"

కనిపెడుతున్నట్టే వుంది. నా మనోసంచలనం-ఒక్క నెల ఓపిక పట్టింది, యింక తనే ప్రారంభించవలసిన అత్యవసరం కలిగింది-దగ్గిరకివొస్తో, మాట్లాడుతో దోవలోనే, తన మెడదగ్గిర గుండీ విప్పింది.

"పేలుడి కేమన్నా మందుందాండీ మీదగ్గర? చూడండి, యెట్లా పేలిందో?"

అని నా చేతికి రాసి చూపించింది. దానితో భారద్వాజ, మైత్రేయ, వశిష్ట యిత్యాతది రుషివంశతిలకం-హిందూమత పునరుద్ధారణ బద్ధకంకణుడు -పడిపోయినాడు, ఒక్కసారిగా-

* * *

అయిదు నిమిషాల్లో తలుపుకొట్టారెవరో, యెవరో వొచ్చారు, చూస్తారు. నా గతేమిటని, నా వొళ్లు కంపమెత్తింది. మా నాన్నా, మామగారూ, ప్రిన్సిపాల్ ముగ్గురూ కలిసి నన్ను ప్రేమతో అర్ధరాత్రి చూడవొచ్చారని నిశ్చయమయింది. నాలిక అంగటికంటుకొని మాట రాలేదు. ఆరుచేతులూ తలుపుకొడుతున్నాయి.

"ఇంకెవరు? ఆ ముండే!" అంది నా 'రూమ్‌మేట్'

'పాలచెంబండీ?' అంది పెద్దామె గొంతు.

మా అత్తగారూ, పోలీసు సూపరెండెంటూ, పై ముగ్గురూ కలిసివస్తేనే నయమనుకున్నాను.

"నీ చెల్లెలు తీసికెళ్ళింది, వెళ్ళమనండి" అందియీమె.

అన్నాను హీనస్వరంతో.

ఒక్క రవ్వసే పూరుకొని, 'పొద్దున్నటి చెంబిక్కడేవుండాలండీ" అంది.

"లేదు"

"వుంది, చూస్తాగా, తలుపు తీద్దురూ"

వూరుకున్నాను. ఒక నిమిషముండి,

"మా చెల్లెలుందండీ, లోపల?" అని అరిచింది.

హడిలిపోయినాను. చుట్టూవున్న యిళ్ళలో తలుపులు, కిటికీలు తీసుకుని, స్త్రీలు పురుషులు అనేకవందలమంది వింటున్నట్టుంది. ఇంక వదలదు, తొరగా వెళ్ళి తలుపు

తీశాను. పెద్దామె లోపలికి వచ్చి, వెంటనే గ్రహించి 'అమ్మ దొంగా!' అని నన్ను పట్టుకుంది. ఆ రాత్రి ముగ్గురమూ ఆ సన్నని కాంప్‌కాట్ మీద యిరికాము.......

తరవాత మూడురోజులు యేమైనానో, యేం చేస్తున్నానో, యెక్కడున్నానో చెప్పలేను- యిద్దరూ ఒకసారే వచ్చేవారు, ఒకసారే వెళ్ళేవారు. ఒకరి తరవాత ఒకరు రాకూడదా అని సూచించాను. చిన్నప్పటినించికూడా వాళ్ళిద్దరికీ శరీరాలు వేరన్న మాటేగాని ఆత్మలూ, కంచాలూ శాలువాలూ అన్నీ ఏక మేననిన్నీ, ఒకర్ని విడిచి వేరుగా, వేరేకాలమందు యింకోరు అనుభవించమనిన్నీ చెప్పారు. ఒకరోజు మధ్యాహ్నం పెద్దామె దోవలో కనపడి,

"దాంతో యెక్కువ సావాసం చెయ్యకండి. తంటా" అంది.

"యేం?"

"దాన్ని వుంచుకున్నవాడికి అనుమానంగా వున్నట్టుంది, కనుక్కున్నాడంటే..."

"నేనేం రమన్నానా, నీ చెల్లెల్ని ?"

"తాగి, వొళ్లుతెలీక, కఱ్ఱతీసుకొని వీధంతా కేకలేస్తో వొచ్చినప్పుడు, వాడితో అనండి, ఆమాట! నాతో యెందుకు?"

ఆ సాయంత్రమే, చిన్నామె కిటికీదగ్గిరికి వొచ్చి తొందరగా "మా అక్కయ్యతో జాగర్తండోయ్! అట్టే రానీకండీ?"

"ఏం?"

"ఇట్టానే మనుషుల్ని మరిగించి, నమ్మించి తటాలున వొదిలేసి పోతుంది - తరువాత మీ అవస్థ యేం చెప్పను? అనేకమంది వురేసుకున్నారు-నామాట వినండి!"

ఈమె కోసమేనా అనేకమంది వురేసుకుంది? వాళ్లు ఎట్లాంటివాళ్ళో ! కాని నన్ను మరిగించి యేడిపించే అపాయం ఏమీలేదు. ఈ యిద్దరి మాటలూ ఒక్కసారిగా, అక్కది చెల్లెలితోనూ. చెల్లెల్ది అక్కతోనూ చెప్పేశాను. ఇంక నా గదిలో వాళ్లుసలిపిన యుద్ధం యెట్లా చెప్పను? మహాప్రభో, వర్ణనాతీతం. మళ్ళీ తిక్కన్న అవతారమెత్తవలసిందే. అరవడానికి వీలులేదు. బుగ్గలు నొక్కుకోడాలూ, పాముల్లాగ బుస్సులు కొట్టడాలూ, రహస్యాలు చెప్పుకుంటున్నట్టు చెవుల్లో తిట్లూ, నన్ను సాక్ష్యాలూ, నన్ను గొప్ప, గొప్ప పేర్లతో ఒకర్నిమించి వొకరు పొగడడం, నన్ను కావిలించుకోవడం, ఒకర్నొకరు రక్కడం, నామీద వొట్లేసుకోవడం, నా బుగ్గలు ప్రేమతో లాగడం కొంతసేపు జరిగించారు. రెవికలు చింపుకొని, జుట్టు పీక్కుని అలిసి యిద్దరూ చప్పుడు లేకుండా నామీదపడ్డారు. భీమ కీచక సంగ్రామనాన్ని వర్ణించిన నలుగురు పురాతన నవీనకవులూ సమితిగా కూడి పద్యాలు వ్రాసినా న్యాయం జరగదు ఆ దృశ్యానికి.

ఐదో రోజున బాధ మొదలు పెట్టింది నాకు. నాకోపంలో రోషంలో అసహ్యంలో యిద్దర్నీ తన్నాను. ఇట్లాంటి రోగాలుంటాయని, వాటి దింత యమబాధ అని నాకంతవరకూ తెలీదు. పుణ్యాత్ములు చెప్పరు. బూతులు తిడతారు గాని యీ విషయం మాట్లాడడం తప్పు.

"నేను చెప్పలా, మీతో! మొదటే చెప్పలా! యీమాట అనలేక, యీ సంగతి చెప్పలేకే ఆ వొంకపెట్టి యీ సంబంధం వొద్దంటే విన్నారూ?" రెండోఆమె అంతే అన్నది.

"నాకా! నాకా! దానికేనండి! మీమీద ఎంత వొట్టుపడితే అంత వొట్టు...పోస్టు జవాన్ సాయేబు లేడండీ......"

రెండోదీ యిదే ధోరణి.

* * *

గది వొదిలిపెట్టి పారిపోయి వొచ్చి, మీ శరణు చొచ్చాను.

◆ ◆ ◆

*రచనాకాలం : 1928*

*ప్రచురణ : (విచిత్రవనలీయం కథల సంపుటి), ఎమెస్కో, 1967*